క్లుప్తంగా

హెచ్‌ఆర్‌డీఏ ఎన్నికల్లో నామినేషన్



నామినేషన్ వేస్తున్న డాక్టర్ యెగ్గన శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: హెల్త్ కేర్ రిఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్(హెచ్‌ఆర్‌డీఏ) ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్(టీఎస్‌ఎంసీ) ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్లను వేసినట్లు హెచ్‌ఆర్‌డీఏ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ యెగ్గన శ్రీనివాస్ తెలిపారు. సోమవారం రోజున టీఎస్‌ఎంసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు గాను హెచ్‌ఆర్‌డీఏ తరుపున 13మంది వైద్యులు నామినేషన్ వేసినట్లు, సెప్టెంబర్ 30వ తేదీ నుంచి నవంబర్ 30వ తేదీ వరకు జరిగే టీఎస్‌ఎంసీ ఎన్నికల్లో అందరు వైద్యులు బాధ్యాతాయుతమైన ఓటు వేసి హెచ్‌ఆర్‌డీఏ ప్యానెల్‌ను గెలిపించాలని కోరారు. హెచ్‌ఆర్‌డీఏ పోరాటం వల్లనే వైద్యులకు, వైద్య వృత్తికి సంబంధించిన ఎన్నో సమస్యలపై కోర్టుకి వెళ్లి 40కి పైగా పిల్స్ వేసి, గెలిచినట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 33వ వార్డులో సోమవారం ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సురేశ్‌బల్దువా, యువ నాయకులు విజిత్‌రావు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల నిరసనకు మద్దతు

మందమర్రిరూరల్: సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్‌తో ఆశవర్కర్లు చేస్తున్న నిరసనకు కాంగ్రెస్ పార్టీ పీసీసీ మెంబర్ నూకల రమేష్ మద్దతు తెలిపారు. ఆరోగ్యకేంద్రం వద్ద వారిని కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఆశవర్కర్లను పనులకు వాడుకుంటూ, కనీస వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. వెంటనే జీవో ప్రకారం వారికి రూ.20వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఉపేందర్ గౌడ్, లక్ష్మణ్, ముజాహిద్ తదితరులు ఉన్నారు.

'బాల్కసుమన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు'

భీమారం: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని పీసీసీ సభ్యులు నూకల రమేశ్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం దాదాపు 100మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరికి రమేశ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ రమేశ్, అర్కాల రమేశ్, నంబయ్య పాల్గొన్నారు.

ఓటు మీ వజ్రాయుధం



మాట్లాడుతున్న తహసీల్దార్

జన్నారం: ఓటు అనేది మీకు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటు హక్కు లేని వారు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో సోమవారం ఆమె ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18సంవత్సరాలు నిండిన బాలబాలికలు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

'ఏరియర్స్ చెల్లించాలి'

నస్పూర్: కోల్ ఇండియాలో చెల్లిస్తున్న విధంగా 11వ వేతన ఒప్పంద 23నెలల బకాయిలను సింగరేణి సంస్థ ఆగస్టు నెల జీతంతో కలిపి సెప్టెంబర్‌లో ఉద్యోగులకు చెల్లించాలని జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్టీరామారావుకు నివాళి

బెల్లంపల్లి: దివంగత మాజీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీరామారావు చిత్రపటానికి బెల్లంపల్లిలో టీడీపీ, బీజేపీ శ్రేణులు శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము సోమవారం ఢిల్లీలో ఎన్టీరామారావు ముఖచిత్రంతో వంద రూపాయల నాణాన్ని విడుదల చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని టీడీపీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పాతమంచిర్యాల: ఎన్టీరామారావు శత జయంతి సందర్భంగా కమ్మ సంక్షేమ సేవ సమితి నాయకులు జిల్లా కేంద్రంలో సంబురాలు చేసుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సుందరీకరణ మరిచారు

- బెల్లంపల్లి మున్సిపాలిటీలో అధ్వానంగా జంక్షన్లు
- పనిచేయని ఫౌంటెన్లు.. వెలగని బల్బులు
- పట్టించుకోని అధికారులు



ఇది బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ముందున్న జంక్షన్. ఏమాత్రం సుందరీకరణకు నోచుకోలేకపోయింది. వాటర్‌ఫౌంటెన్, రంగుల బల్బులు ఉన్నా ఏడాదికి ఒకటి, రెండుసార్లు ఆన్‌చేసి మమ అనిపిస్తున్నారు. జంక్షన్ అన్న మాటే కానీ, ఆ తీరుగా కనిపించడం లేదు. తగిన రీతిలో నిర్మించకపోవడంతో పురప్రజలను ఆకట్టుకోలేకపోతోంది.



ఏఎంసీ చౌరస్తాలో నిర్మించిన జంక్షన్

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో కొన్నేళ్ల క్రితం ప్రతిపాదించిన జంక్షన్ల నిర్మాణం పడకేసింది. కొన్నిచోట్ల మాత్రమే జంక్షన్లు నిర్మించగా మిగితా ప్రాంతాల్లో ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చకుండా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ద్వితీయ శ్రేణి బెల్లంపల్లి మున్సిపాలిటీలో నాలుగు చోట్ల జంక్షన్లు ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. 2016లో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.50లక్షలు వెచ్చించి మున్సిపల్ కార్యాలయం ఎదుట, ఏఎంసీ ఏరియా, పాత సింగరేణి జీఎం కార్యాలయం క్రాస్‌రోడ్, కాంటా చౌరస్తాలలో జంక్షన్‌ల నిర్మాణం చేపట్టారు. వీటితో పాటు పోచమ్మ గడ్డ చౌరస్తా, కొత్త బస్టాండ్ క్రాస్‌రోడ్, అంబేద్కర్‌నగర్ చౌరస్తాలలో హైమాస్ట్ లైట్లను బిగించారు.

ఏదీ సుందరీకరణ?

మున్సిపాలిటీలో జంక్షన్లు అధ్వానంగా ఉన్నాయి. చౌరస్తాను వేదికగా చేసుకుని నిర్మించిన జంక్షన్లు సుందరీకరణకు నోచుకోలేకపోయాయి. కేవలం రౌండ్ షేప్‌లో గద్దెను నిర్మించి దానికి ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. మధ్యలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి హైమాస్ట్ లైట్లను అమర్చారు. జంక్షన్ వద్ద వాటర్ ఫౌంటెన్, రంగురంగుల విద్యుత్ బల్బులను ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దాల్సి ఉండగా, అలాంటి చర్యలు చేపట్టలేదు. పచ్చగడ్డి కానరాకుండా పోయింది. నాలుగు చోట్ల జంక్షన్‌లు ఏమాత్రం ఆహ్లాదకరంగా లేవని పురప్రజలు పెదవి విరుస్తున్నారు. ఏదో ముఖ్యమైన రోజుల్లో తప్పా, జంక్షన్ల వద్ద రంగుల బల్బులను వెలిగించడం లేదు. వాటర్ ఫౌంటేన్ పనిచేసేలా చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు జంక్షన్‌ల నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవాలని పురప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శ్రద్ధ పెట్టడం లేదు



జంక్షన్ల నిర్వహణలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఎప్పుడో తోచినప్పుడు ఒకటి, రెండు చోట్ల వాటర్ ఫౌంటెన్‌లను ఆన్ చేయడం, అప్పటికప్పుడు బల్బులు ఏర్పాటు చేసి వెలిగించి ఆ తర్వాత విస్మరించడం పరిపాటిగా మారింది. జంక్షన్‌లను మరింతగా ఆధునీకరించి రోజువారీగా నిర్వహించాలి.

- కటకం సతీష్‌కుమార్, మాజీ కౌన్సిలర్

పేదల కోసమే జనరిక్ మందులు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



పీహెచ్‌సీ వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నెన్నెల: పేదలకు మందుల ఖర్చు తగ్గించడానికే ప్రభుత్వాలు జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేస్తున్నాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండల కేంద్రంలో జనరిక్ మందుల షాపును సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ మెడికల్ షాపులలో నాణ్యమైన మందులు 90శాతం తక్కువ ధరకే లభిస్తాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, తక్కువ ఖర్చుతో ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం జనరిక్ మందుల షాపును ప్రారంభిస్తుందన్నారు. ఈ మధ్యకాలంలో మార్కెట్లో లభ్యమయ్యే ఔషదాల్లో కొన్ని రకాల మందులు నాసిరకంగా వస్తున్నాయని, జనరిక్ మందులు చాలా బాగా పని చేస్తాయన్నారు. ఒక షుగర్, బీపీ పేషంట్‌లకు నెలకు రూ.3వేల వరకు ఖర్చు అవుతుందని, అవే జనరిక్ మందులైతే రూ.వెయ్యికే కొనుగోలు చేయవచ్చన్నారు. ప్రజలు జనరిక్ మందులు వాడి ఖర్చులను తగ్గించుకోవాలని కోరారు. అనంతరం నెన్నెల ప్రభుత్వ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి అక్కడి సమస్యలను వైద్యాధికారి లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి రావడానికి సరైన దారి లేదని వైద్యుడు చెప్పడంతో, త్వరలోనే రోడ్డు మంజూరుకు నిధులు కేటాయిస్తానన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామల, సర్పంచ్ తోట సుజాత, ఎంపీటీసీ పురంశెట్టి తిరుపతి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సాగర్ గౌడ్, ఆత్మ చైర్మన్ సున్నం రాజు, మండల రైతు సమితి అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట మధు తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ కల్పించేందుకే నిర్బంధ తనిఖీలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణ

జన్నారం: ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించేందుకే నిర్బంధ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు లక్సెట్టిపేట సీఐ ఆర్.కృష్ణ తెలిపారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని కొత్త పుట్టిగూడలో లక్సెట్టిపేట సర్కిల్ పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించి ఇళ్లలో నిర్బంద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ.. నేరాల నిర్మూలన కోసం కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో భద్రతా భావం పెంచడానికి, అపరిచిత వ్యక్తుల వివరాలు తెలుసుకోవడానికి తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. బైక్‌పై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జన్నారం ఎస్సై సర్కార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో బీజేపీ నాయకుల ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూర్‌రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో అయ్యప్ప స్వామి ఆలయం వైపు ఉన్న వ్యాపారస్తులను ఇబ్బంది పెట్టే విధంగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారని బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. వ్యాపారాలు చేసుకునే వారి దుకాణాల ఎదుట ఇనుపగ్రిల్స్ ఏర్పాటు చేశారు, కానీ మున్సిపల్ చైర్మన్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయకుండా ఉండటం కోసం ఆ షాపు యాజమాన్యం మున్సిపల్ అధికారులకు రూ.4లక్షలు ఇచ్చినట్లు ఆరోపించారు. డబ్బులు తీసుకున్నందునే మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి అక్కడ గ్రిల్స్‌ను ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుశీల్‌కుమార్, పట్టణ కార్యదర్శి చింతల శ్రీనివాస్, నాయకులు సంతోష్, శివకృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణికి స్పందన కరువు'

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ప్రజావాణి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు.

చెన్నూర్ టికెట్ కోరిన భాస్కర్

చెన్నూర్: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కేటాయించాలని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డిని కోరినట్లు ఓయూ జేఏసీ, టీఎస్ జేఏసీ చైర్మన్ దుర్గం భాస్కర్ తెలిపారు.

సైబర్ నేరాలు, ఉమెన్ సేఫ్టీపై అవగాహన



చెన్నూర్: అవగాహన కల్పిస్తున్న సీఐ విద్యాసాగర్

దండేపల్లి/బెల్లంపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/జన్నారం/లక్సెట్టిపేట/చెన్నూర్: సైబర్ నేరాలు, ఉమెన్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై పోలీసులు సోమవారం పలు పాఠశాలల్లో అవగాహన కల్పించారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సై కుందారపు ప్రసాద్, హాజీపూర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ఎస్సై నరేశ్‌కుమార్, జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లక్సెట్టిపేట సీఐ కృష్ణ, లక్సెట్టిపేట వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఎస్సై లక్ష్మణ్, బెల్లంపల్లి పాత బస్టాండ్ ఏరియా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వన్‌టౌన్ ఎస్సై రమేష్, చెన్నూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థినులు పోలీసులకు రాఖీలు కట్టారు.

సంక్షిప్త వార్తలు

దివ్యాంగుల నూతన కార్యవర్గం

జన్నారం: మండల దివ్యాంగుల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆకుల మల్లేశ్, అధ్యక్షుడిగా ఐలవేని నర్సయ్య, ఉపాధ్యక్షులుగా నారపాక జయరాజ్, చంద్రశేఖర్, కార్యదర్శిగా జాడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా భాగ్యలక్ష్మి, దువ్వాక రాజు, అనిల్, కోశాధికారిగా కాల్వ సుగుణ, సభ్యులుగా పోశవ్వ, సత్తవ్వ, కమల, విక్రం, భూషణం నియామకమయ్యారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలని రెడ్‌క్రాస్ సోసైటీ ఆధ్వర్యంలో సోమవారం జీఎం మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు.

సైన్స్‌పై అవగాహన

నెన్నెల: మండలంలోని నార్వాయిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. మానవ శరీరం, అస్తిపంజరం, గుండె, ఊపిరితిత్తులు, అంతర్గత అవయవాలు, వాటి విధానం ప్రయోగపరికరాలు, పని విధానం గురించి విద్యార్థులకు వివరించారు.

పరామర్శ

జన్నారం: రిటైర్డ్ ఫారెస్ట్ అధికారి, కాంగ్రెస్ కార్యకర్త అజార్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆ కుటుంబాన్ని సోమవారం ఉట్నూర్ జెడ్పీటీసీ, పీసీసీ సభ్యురాలు రాథోడ్ చారులత పరామర్శించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.

'నిరుపయోగంగా బస్టాండ్'

మందమర్రిరూరల్: మందమర్రి మార్కెట్‌లో 30ఏళ్ల క్రితం టీడీపీ హయాంలో నిర్మించిన బస్టాండ్ ప్రస్తుతం నిరుపయోగంగా తయారై, అసాంఘిక కార్యక్రమాలకు నిలయమైందని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ మండిపడ్డారు. పార్టీ నాయకులతో కలిసి సోమవారం మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. బాల్క సుమన్ పట్టించుకోకపోవడం వల్లనే బస్టాండ్ నిరుపయోగంగా మారిందని విమర్శించారు. ఇప్పటికైనా మార్కెట్ బస్టాండ్‌కు బస్సులు వచ్చేలా చూడాన్నారు.

ట్రస్మా మండల అధ్యక్షుడిగా ఉప్పలయ్య

రామకృష్ణాపూర్: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) మందమర్రి మండల అధ్యక్షుడిగా ఆర్‌కేపీ ఎస్‌ఆర్‌కే పాఠశాల కరస్పాండెంట్ పెద్దపెల్లి ఉప్పలయ్యను ఎన్నుకున్నారు. ఆదివారం సాయంత్రం మందమర్రిలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జరిగిన ప్రైవేట్ పాఠశాలల సమావేశంలో ఉప్పలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా రిసోర్స్ హైస్కూల్ కరస్పాండెంట్ కరుణాకర్‌రెడ్డి, కోశాధికారిగా సెవెన్ హిల్స్ కరస్పాండెంట్ రామగిరి కృష్ణమోహన్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర్ల సిద్దయ్య, రాంవేణు, పోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సుమన్‌కు ఓటమి భయం పట్టుకుంది'

మందమర్రిరూరల్: ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు ఓటమి భయం పట్టుకొని మతి భ్రమించిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు సొత్కు సుదర్శన్ మండిపడ్డారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సుమన్ నిర్వహించిన ఆశీర్వాద సభలో కాంగ్రెస్ వాళ్లంతా మనవాళ్లేనని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. చెన్నూర్‌లో సుమన్ ఓడిపోవడం ఖాయమని ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

కళను నమ్ముకుని బతుకుతున్నాం.. కనికరించండి!

- దుబ్బులకొలుపు కళాకారులను ఆదుకోండి
- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జునుగరి దుర్గయ్య



మాట్లాడుతున్న దుబ్బులకొలుపు కళాకారులు

పాతమంచిర్యాల: దుబ్బులకొలుపు వృత్తి కళాకారులకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం కల్పించి ఆదుకోవాలని ఆ కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జునుగరి దుర్గయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కొలుపు కళాకారులకు సంబంధించిన ఆరు వేల కుటుంబాలు కళను నమ్ముకొని బ్రతుకుతున్నాయని, తమకు సరైన ఆదరణ లేక ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సంస్కృతికశాఖ తరుపున గుర్తింపు కార్డులు అందించి, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుబ్బుల కొలుపు కళాకారుల సంఘం డివిజన్ అధ్యక్షుడు జునుగరి శంకర్, జిల్లా అధ్యక్షుడు జునుగరి నారాయణ, కళాకారుల బృందం నాయకులు ప్రసాద్, అంజనేయులు, భీమరాజు, కళ్యాణ్, మహేష్ పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో ఆరు తీర్మానాలు



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటనారాయణ

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో సోమవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆరు అంశాలపై సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపాలిటీలోని 2వ వార్డులో వీధి దీపాల ఏర్పాటు కోసం కావాల్సిన స్తంభాలు కొనుగోలు చేయుటకు అయ్యే ఖర్చు రూ.4లక్షలను పట్టణ ప్రగతి నిధుల నుంచి వ్యయం చేసేందుకు ఆమోదించారు. వార్డు నెంబరు 7, 8, 9 , 10లలో సిమెంటు కాల్వలు, సిమెంటు రోడ్లతో పాటు కౌన్సిల్ మీటింగ్ హాల్ నిర్మాణం కోసం అయ్యే ఖర్చు రూ.51లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వెచ్చించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు, ఆర్‌వో కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కోటపల్లి: మండలంలోని ఎదులబంధం గ్రామంలో దివ్యాంగులతో జెడ్పీ కో ఆప్షన్ అజ్గర్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రూ.4016 పెన్షన్ తీసుకుంటున్న దివ్యాంగులు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జెడ్పీ కో ఆప్షన్ అజ్గర్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జేక శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బన్న ఆశాలు మృతి



కాసిపేట: మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బన్న ఆశాలు(83)అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందాడు. 18సంవత్సరాలుగా రాజకీయంలో ఉండి కాసిపేట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, మంచిర్యాల మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పలు పదవుల్లో కొనసాగడంతో పాటు మండలంలో పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్నాడు. పాత రాజకీయాలకు గుర్తింపుగా కనిపించే ఆశాలు మృతి చెందడంతో మండలంలో విషాదచాయలు అలుముకున్నాయి. అన్ని వర్గాల ప్రజలు, అన్ని పార్టీల నాయకులు నివాళులర్పించి సంతాపం ప్రకటించారు.

ప్రముఖుల నివాళి..

ఆశాలు మృతి చెందడంతో నియోజకవర్గంలోని ప్రముఖులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీజేపీ నాయకుడు కొయ్యల ఏమాజీ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేణికుంట ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు వేముల కృష్ణ, బండి ప్రభాకర్, నాతరి స్వామి, మాలమహానాడు జిల్లా నాయకులు నస్పూరి నర్సింగ్, లచ్చన్న, మేడ సమ్మయ్య, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, ఏరియా నాయకులు వోడ్నాల రాజన్న, సంపత్, దూట శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు దాగం మల్లేష్, మినుగు లక్ష్మినారాయణ, కాసిపేట గని రక్షణాధికారి సునిల్, సంక్షేమాధికారి జీశాన్, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు నివాళులర్పించారు.

మండల సమావేశానికి సర్పంచులు డుమ్మా..!

- 11మందికి.. ఒక్కరే హాజరు



విద్యుత్‌శాఖ ఏఈని ప్రశ్నిస్తున్న తిరుపతి

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీటీసీ పెద్దల రూప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. భీమారం నుంచి కాజిపల్లి వైపు సరఫరా చేసే విద్యుత్ లైన్‌లో తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంతో కాజిపల్లి వైపు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాజిపల్లి సర్పంచ్ దాడి తిరుపతి విద్యుత్ ఏఈ కుమార్‌ను ప్రశ్నించారు. పోతన్‌పల్లి వద్ద లైన్ జంపర్లు కట్‌చేసి సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. తగిన చర్యలు తీసుకుంటామని, మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ కుమార్ హామీ ఇచ్చారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే ఎస్సీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు నిధులు ఉన్నాయని, ఎస్సీ సంక్షేమ అధికారి సాయిలచ్చన్న సభకు తెలిపారు. దీనికి దరఖాస్తు చేసుకోవాలని తాము కోరుతున్నా, తల్లిదండ్రులు స్పందించడం లేదన్నారు. బ్యాంకు ఖాతాలు తెరవడం కష్టంగా మారిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని సభ్యులు గ్రామాలవారీగా విద్యార్థులను గుర్తించి ఖాతాలు ఇప్పించి స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరా పూర్తి స్థాయిలో జరగడంలేదని, అధికారులు చర్యలు తీసుకొని ప్రజలకు స్వచ్ఛ నీటిని అందించాలని ఎంపీటీసీ రూప కోరగా, అందుకు ఇంజినీర్ వివేక్ అంగీకరించారు. రుణమాఫీ పథకం ద్వారా డబ్బులు జమ కాకపోవడంతో, అనేక మంది ప్రజలు నష్టపోతున్నామని తన దృష్టికి తెచ్చారని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఏఈవో అరుణ్‌కుమార్ సమాధానమిస్తూ ఖాతాలు నిలిచిపోయిన వారికి తిరిగి బ్యాంకులో ఖాతాలు ఇప్పించి, వారికి రుణమాఫీ డబ్బులు జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కొత్తపల్లిలోని చెరువు మత్తడి నిర్మించేందుకు, ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. భీమారం మండల కేంద్రంలోని ఊరచెరువు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వవిప్ బాల్క సుమన్ ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

సర్పంచులు గైర్హాజరు

మండల సర్వసభ్య సమావేశానికి హాజరై ప్రజల సమస్యలపై చర్చించాల్సిన మండలంలోని 11మంది సర్పంచుల్లో కేవలం కాజిపల్లి సర్పంచ్ మాత్రమే హాజరయ్యారు.

మాలమహానాడు జిల్లా గౌరవాధ్యక్షుడిగా మొగిలయ్య



రామకృష్ణాపూర్: మాలమహానాడు జిల్లా గౌరవాధ్యక్షుడిగా రామకృష్ణాపూర్‌కు చెందిన బైరమల్ల మొగిలయ్యను నియమించారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మొగిలయ్యను ఎంపిక చేశారు. ఈ మేరకు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్‌లు నియామకపు పత్రాన్ని అందించారు. మాలల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని మొగిలయ్య పేర్కొన్నారు.

ఫ్యాన్లు అందజేత

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ శివారులోని శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయానికి మంచిర్యాలకు చెందిన ఎక్కిరాల ప్రసాద్ సోమవారం ఆరు ఫ్యాన్లు అందజేశారు.